క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



కల్యాణ వేదికపై వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లు

రామసముద్రం: రామసముద్రం మండలం మినికి గ్రామంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వేదపండితులచే వేదమంత్రోచ్ఛారణతో కళశారాధన, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్య, ఉపాధితోనే అభివృద్ధి

కలకడ : ఉత్తమ విద్య, యువతకు ఉపాధి అవకాశం కల్పించినప్పుడే అభివృద్ధికి అవకాశం ఉంటుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలకడ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ముబారక్ అహమ్మద్ వాల్మీకిపురంలో మాజీ ఎమ్మెల్యేని కలిసి తనకు పదవి ఇచ్చినందుకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముబారక్ అహమ్మద్ మాట్లాడుతూ గత ఏడాది విద్యార్థులకు అమ్మ ఒడి వేయలేదని, యువతకు ఉపాధి కల్పించలేదన్నారు. తనకు పార్టీలో అవకాశం కల్పించినందుకు మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దళితవాడల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : మండలంలోని దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ ఎం.భీమేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని తలపుల పంచాయతీ పెద్ద హరిజనవాడలో పౌరహక్కుల దినం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి స్మశాన స్థలం, రోడ్డు సౌకర్యం, వీధి లైట్లు కల్పించాలని, అర్హులకు ఇంటి పట్టాలు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర్, ఎస్ఐ లోకేష్, హౌసింగ్ డీఈ రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



లేగ దూడల యజమానులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కురబలకోట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జంగావారిపల్లెలో లేగ ద డల ప్రదర్శన నిర్వహించారు. ఈ పదర్శనలో 65 లేగ దూడలు పాల్గొనగా వాటి పోషణ, ఆకృతి, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఉత్తమ లేగ దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అంగళ్లు ఏడీ శ్రీధర్ రెడ్డి, పశువైద్యాధికారి నవీన్ మాట్లాడుతూ నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులన్నారు. లేగ దూడల నిర్వహణలో శుభ్రత, పోషణ, వ్యాధి నిరోధక చర్యలు కీలకమన్నారు. యాజమాన్య పద్ధతుల్లో దూడలను పెంచడం ద్వారా అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు.

విత్తన కాయలు రెండు బస్తాలే

పెద్దతిప్పసముద్రం: రెండు ఎకరాలకు పైన ఎంత విస్తీర్ణంలో భూమి ఉన్నా ఒక్కో రైతుకు రెండు బస్తాల విత్తన కాయలే ఇస్తామని ఏవో ప్రేమలత అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో భాగంగా మండలానికి ఇప్పటి వరకు 1,500 బస్తాల రాయితీ వేరుశనగ విత్తన కాయలు మంజూరయ్యాయన్నారు. కేసిక్స్ రకం గల ఈ ఒక్కో విత్తన బస్తా రూ.1,675ల చొప్పున అందజేస్తామన్నారు. రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్, మొబైల్ తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించాలని ఏవో సూచించారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

తంబళ్లపల్లె: మండలంలోని చౌకదుకాణ డీలర్లు, కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ హరికుమార్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ సివిల్ సప్లయ్స్ డీటీ భువనేశ్వరి, ఈడీటీ మాలాలీలు మూడు బృందాలుగా ఏర్పడి 39 చౌకదుకాణాలను తనిఖీ చేశారు. ఈపోస్ లైసెన్సు, తూనికల యంత్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఒకటో తేదీ నుంచి చౌకదుకాణాల ద్వారానే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి 8 వరకు పంపిణీ చేయాలని సూచించారు. వారి వెంట వీఆర్‌ఓలు, స్టోర్‌డీలర్లు ఉన్నారు.

‘మహా’ మోసం.. ఆడబిడ్డ నిధి

- 12 నెలలైనా అమలు కాని ఆడబిడ్డ నిధి
- కూటమి నేతల హామీలకు మోసపోయిన మహిళలు
- సాయం కోసం ఎదురుచూపు



మహాశక్తి ఆడబిడ్డ నిధి పేరుతో ప్రతి ఇంట్లో 18 ఏళ్ల నిండిన మహిళలు ఎంత మంది ఉంటే అందరికీ నెలకు రూ. 15,00 ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. దీంతో మహిళలు సైకిల్ పార్టీకి ఓట్లేసి గెలిపించారు. ఇప్పుడు ఆ హామీని అటకెక్కించారు.

బి.కొత్తకోట: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మడతపెట్టింది. సూపర్ సిక్స్, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం ఇలా ప్రతి వర్గానికి హామీలిచ్చిన చంద్రబాబు తీరా గద్దెనెక్కాక వాటిని తుంగలోకి తొక్కారు. హామీల అమలును విస్మరించారు. ఇందులో ఉన్నదే ఆడబిడ్డ నిధి. ఈ పథకం కింద 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్క మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. దీనికి ఎంతో ప్రచారం కల్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక మహిళా సంక్షేమాన్ని విస్మరించడమేకాక ఈ అడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయడం మరచిపోయారు.

రూ.442 కోట్లు మోసం

తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లోని మహిళలకు కూటమి ప్రభుత్వం రూ.442 కోట్లు చెల్లించాల్సిన ఆడబిడ్డ నిధి సొమ్మును చెల్లించకుండా మోసం చేసింది. 2024 జూన్ నాటి లెక్కల ప్రకారం .. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 18 ఏళ్ల నిండిన, ఆపై వయసు కలిగిన వారు 1,08,566 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తే నెలకు రూ.16,28,49,000 చెల్లించాలి. మదనపల్లె నియోజకవర్గంలో 18 ఏళ్ల నిండి ఆపై వయసు కలిగిన మహిళలు 1,37,020 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.20,55,30,000 చెల్లించాలి. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2024 జూన్ నుంచి 2025 మే వరకు 12 నెలలకు రూ.246,63,60,000 చెల్లించాల్సి ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లోని 2,45,586 మంది అర్హులైన అడబిడ్డ నిధి పథకం మహిళలకు రూ.442,05,48,000 చెల్లించాలి. అయితే ఈ నిధుల్లో ఇంతవరకు పైసా చెల్లించలేదు. సూపర్ సిక్స పథకాల్లో ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు.

తంబళ్లపల్లె, మదనపల్లెల్లో మహిళల సంఖ్య

మండలం	మహిళలు	లబ్ధి (రూ.నెలకు)
ములకలచెరువు	18,305	2,70,52,500
తంబళ్లపల్లె	15,912	2,38,68,000
పెద్దమండ్యం	13,254	2,98,10,000
పెద్దతిప్పసముద్రం	19,994	2,99,91,000
బి.కొత్తకోట	24,283	3,64,24,500
కురబలకోట	16,818	2,52,27,000
మదనపల్లె రూరల్	44,179	6,62,68,500
మదనపల్లె పట్టణం	59,607	5,96,07,500
నిమ్మనపల్లె	13,329	1,99,93,500
రామసముద్రం	19,905	2,98,57,500

వెంటనే ఇవ్వాలి



అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు నెలకు రూ.1,500 అర్థిక సహాయం అందిస్తామని చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలి. పథకం అమలు చేసేందుకు ప్రభుత్వానికి ఏడాది సరిపోతుంది. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నాం.

–ఇరగేశ్వరి, కేసీపల్లె, రామసముద్రం

ఎప్పుడిస్తారో చెప్పాలి



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందని ఎదురుచూస్తున్నాం. ఆడబిడ్డ నిధి ఏడాదిగా అమలు చేయలేదు. ఇదేకాక మిగిలినా హామీలు కూడా అమలు చేయకపోవడంతో ఆర్థిక సహాయం పొందలేకపోతున్నాయి. అడబిడ్డ నిధి ద్వారా తక్షణమే ఆర్థిక సహాయం అందించాలి.

వి.ఈశ్వరమ్మ, మదనపల్లె

పవన్‌కల్యాణ్ స్పందించాలి



ఆడబిడ్డ నిధి అమలుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలి. ఏడాదిగా ఈ పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నాం. బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు ప్రకటించి ఏం లాభం. ఎన్నికల హామీలు అమలు చేయడంలో జాప్యం చేస్తున్న ప్రభుత్వం ఆడబిడ్డ నిధి ద్వారా రూ.1,500 చెల్లించాలి.

–కవిత, కురబలకోట

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏడీఏ వైవీ రమణరావు

పీలేరు : ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని పీలేరు ఏడీఏ వైవి. రమణ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని తలపులలో కేవీకే ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. ఖరీఫ్‌లో వేరుశనగ, ఉలవ రకాలు, వాటిని సాగు విధానంపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగు తడుపు దూడల యాజమాన్యం వల్ల పాడి రైతులకు కలిగే లాభాలు, ఉద్యాన పంటల గురించి ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి టి. సుకుమార్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త మంజుల, ఏవో రమాదేవి పాల్గొన్నారు.

వేరుశనగ సాగుకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఈశ్వర్‌నాయక్

కలకడ: మండలంలోని రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ సాగు సన్నద్ధం కావాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి లావణ్య కోరారు. శుక్రవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీలో కలికిరి కేవీకే సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల ఆధ్వర్యంలో వేరుశనగ సాగుపై అవగాహన కల్పించారు. వేరుశనగలో అంతర్ పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అప్పుడే అధిక ఆదాయం రైతులు పొందే అవకాశం ఉందని తెలిపారు. వేరుశనగ పంటలో తుంగకలుపు నివారణకు డైక్లోఫులాఫ్ 1,200 లీటర్లు నీటిలో 12 గ్రాములు కలిపి పిచికారి చేస్తే తుంగ పెరగదని తెలిపారు. అంతర్ పంటలుగా కంది, పెసరు, మినుములు, అలసంద వంటి పంటలు సాగుచేయడంతోపాటు గట్టు చివరిలో జొన్న సాగు చేయాలని సూచించారు. అలాగే ఉద్యానవన పంటల సాగుపై కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఈశ్వర్‌నాయక్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కమల్‌నాథ్, గోపాల్‌నాయుడు, విశ్వనాథశెట్టి, గ్రామ వ్యవసాయ సహాయకులు శరత్, రవి, రెడ్డి కుమార్, రైతులు పాల్గొన్నారు.

పీలేరు నుంచి బెంగళూరుకు కొత్త బస్సులు



బస్సు వద్ద డీపీటీఓ రాము తదితరులు

పీలేరురూరల్ : ప్రయాణికులు, వ్యాపారస్తులు, ఉద్యోగుల సౌకర్యార్థం పీలేరు నుంచి బెంగళూరుకు రెండు కొత్త సర్వీసులు ప్రారంభించనున్నట్లు డీపీటీఓ రాము తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఓఆర్, ఈపీకేలో జిల్లా 18వ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో ఆర్టీసీ నెలకు టోల్‌గేట్ రూ.37,68,580 చెల్లిస్తున్నట్లు తెలిపారు. పల్లె వెలుగు బస్సు సర్వీసుల వల్ల నష్టం వస్తున్నట్లు చెప్పారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల వల్ల మంచి లాభాలు వస్తున్నట్లు చెప్పారు. బస్సుల కండీషన్ మెరుగుపరచుకోవాలని సిబ్బందినా ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. డీఎం బి. నిర్మల, సీఐ సుబ్బమ్మ, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రెడ్డి సంక్షేమ సంఘం మాజీ కార్యదర్శి కంభం నాగభూషణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు సమావేశం సందర్భంగా క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు హాకీ క్రీడలో మంచి ప్రావీణ్యం పొందడం అభినందనీయమన్నారు. ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ నాగూరు శివారెడ్డి మాట్లాడుతూ నేడు విద్యార్థులు సెల్‌ఫోన్లలో గేమ్స్ వంటి చూడటం వల్ల పలు అనర్థాలకు గురవుతున్నారన్నారు. క్రీడలు ఆడటం వల్ల చదువుతో పాటు ఆరోగ్యం బాగుటుందన్నారు. వేసవి శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఽప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ మాజీ చైర్మన్ బింగి పాండు, యాదవ సంఘ నాయకులు రెడ్డప్పయాదవ్, డైరీడే చంద్రరెడ్డి, హాకీ శిబిరం నిర్వాహకులు పి.ప్రసాద్‌రెడ్డి, కోచ్ నౌషాద్ పాల్గొన్నారు. ఫైనల్స్ మ్యాచ్‌ల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఉచిత సమ్మర్ హాకీ కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులు ఉల్లాసంగా ఉత్సాహంగా కేరింతలతో డ్యాన్సులు చేశారు. మెడల్స్ అందుకున్న తరువాత మైదానంలో క్రీడాకారులతో నృత్యాలు చేశారు.



క్రీడాకారులతో కోచ్‌లు, అతిథులు

మైనారిటీలకు అండగా వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



ముస్లింలతో నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె : రాష్ట్రంలోని ముస్లిం, మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ భరోసా ఇచ్చారు. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సింగంవారిపల్లె ముస్లింల ఆహ్వానం మేరకు శుక్రవారం స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు నిరంతరం కృషి చేసిందన్నారు. ముస్లింలకు వైఎస్.జగన్ చేసిన మేలు, దేశచరిత్రలో ఏ ఒక్కరూ ఇప్పటివరకు చేయలేదని స్పష్టం చేశారు. వక్ఫ్‌భూములు అన్యాక్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా జీఓ 60 తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతిస్తే... వైఎస్సార్ సీపీ వ్యతిరేకిస్తూ ముస్లింలకు అండగా నిలిచిందన్నారు. కూటమిప్రభుత్వం ఏడాదిపాలనలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలుచేయకపోగా, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను ఏమారుస్తోందని విమర్శించారు. కూటమిప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవాజ్, మహమ్మద్‌రఫీ, మజర్, అయూబ్, సయ్యద్‌సాబ్, ఇర్షాద్, కాలేషా, అంజాద్, ఆర్టీఏ నూర్, హబీబ్, నాసీర్, ఎస్.ఖాన్, యూనస్, జబీవుల్లా, మసీదుకమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

మదనపల్లె సిటీ: యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా గురువు గురుమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో యోగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో యోగసనాలు చేయించారు. యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. చురుకుదనం, మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు ఖాజవల్లి, మోహన్‌బాబు, సుబ్బరాయుడు, వెంకటశివ, యాస్మిన్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం

రామసముద్రం: యోగా వలన మానసిక ఉల్లాసం కలిగి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. శుక్రవారం రామసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో యోగాంధ్రలో భాగంగా మండల స్థాయి అధికారులతో కలసి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు జరిగే యోగాంధ్రలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామ స్థాయిలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. యోగ వలన ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ గఫూర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మదనపల్లె సిటీ: విద్యా సంవత్సరం ప్రారంభంకాక మునుపే అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం స్థానిక ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ముందస్తు అడ్మిషన్లు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా పుస్తకాల పేరుతో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, ఆఫ్రిద్, జయబాబు, సమీర్, అఖి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

మదనపల్లె: మున్సిపాలిటిలో పనిచేస్తున్న దినసరి కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మస్తాన్, కార్యదర్శిక చలపతినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యూనియన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఐదునెలలుగా దినసరి కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. ఆప్కాస్ కార్మికులకు ఈపీఎఫ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. పర్మినెంట్ కార్మికుల క్వార్టర్స్‌ను కమిషనర్ తక్షణమే పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు ఇంటిస్థలాలను మంజూరు చేయాలన్నారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, కృష్ణప్ప, జానకి, దేవా, సంజీవ, వాసు, చంద్ర, ఇంద్రాణీ పాల్గొన్నారు.

ఆస్పత్రి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సహించం

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి పరిపాలనా వ్యవహారాల్లో ఇతరులు జోక్యం చేసుకుని ఇబ్బందులు కలగజేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. అలాంటి వారిపై కేసులు నమోదుచేయిస్తామన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రోడ్డుప్రమాదంలో మృతిచెందిన రాయచోటి నవాజ్ మృతదేహాన్ని చూసేందుకు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మృతదేహాన్ని తరలించేందుకు ఫ్రీజర్‌బాక్స్ అవసరమైతే రూ.3వేలు అడిగారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఈ విషయమై ఎమ్మెల్యే ఆస్పత్రి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ఆర్ఎంఓ సయ్యద్‌షుకూర్, చిన్నపిల్లల వైద్యనిపుణులు భరత్, సివిల్‌అసిస్టెంట్ సర్జన్ మన్సూర్, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గాలివీడు : బాలికలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగివుండాలని తద్వారా కుటుంబ మనుగడ సాధ్యమవుతుందని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నడింపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం - ఆర్థిక అక్షరాస్యతపై వేసవి సెలవుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ పాటించడం, బడ్జెట్ తయారీ, పొదుపు, పెట్టుబడులు, అవసరాలు, కోరికలు, భవిష్యత్ లక్ష్యాలు, ఆర్థిక ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మండల సమావేశమా.. మినీ మహానాడా?

- టీడీపీ నాయకులతో నిండిపోయిన మండల సమావేశం
- ప్రజాప్రతినిధుల స్థానంలో ఓడిపోయిన నాయకుల హవా



సమావేశంలో టీడీపీ నాయకులు

మదనపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగబద్ధమైన పదవులకు పాతరేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారి స్థానంలో ఓడిపోయిన నాయకులు కూర్చుని దర్జాగా అధికార హోదాను అనుభవిస్తున్నారు. శుక్రవారం మదనపల్లె మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం టీడీపీ మినీ మహానాడును తలపించింది. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మాత్రమే మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనే హక్కు ఉంటుంది. అయితే మదనపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండలానికి సంబంధం లేని మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే సాక్షిగా సమావేశంలో దర్జాగా కూర్చున్నప్పటికీ, అటు ఎమ్మెల్యే, ఇటు ఎంపీడీఓ ఇద్దరూ కనీసం మాట వరుసకైనా వారిని వెళ్లిపోమని చెప్పకపోగా, సమస్యల ప్రస్తావనలోనూ వారి అభిప్రాయాలకే విలువ ఇవ్వడం జరిగింది.

ఎమ్మెల్యే కోసం ఎదురుచూపు

ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్యసమావేశం షెడ్యూల్ సమయం ప్రకారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరవుతారని చెప్పడంతో ఆయన కోసం ఎదురుచూస్తూ సమావేశాన్ని ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేశారు. సమావేశాన్ని ప్రారంభిస్తే ఎమ్మెల్యే మధ్యలో వచ్చి కలుసుకుంటారని చెప్పడంతో ఎంపీడీఓ మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత అధికారులను తమ ప్రగతికి సంబంధించి వివరించాల్సిందిగా కోరారు. 15 నిమిషాల తర్వాత ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమావేశానికి వచ్చారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 76 గ్రామసమాఖ్యలకు సమావేశ నిర్వహణకు భవన నిర్మాణాలకు సంబంధించి స్థలాలు మంజూరుచేయాలని తహసీల్దార్ ధనంజయులను ఆదేశించారు. కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్ట గంగమ్మగుడికి వెళ్లే దారిలో ఆక్రమణలు పెరిగిపోయాయని, తక్షణమే సర్వే నిర్వహించి రోడ్డుస్థలంలో నిర్మించి ఉంటే తొలగించాల్సిందిగా ఆదేశించారు. దిగువపల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.

ఎమ్మెల్యేతో పాటుగా వచ్చారంతే..

మండల సర్వసభ్య సమావేశంలో ఇతరులు పాల్గొనడంపై ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌ను వివరణ కోరితే ఎమ్మెల్యేతో పాటుగా వారు వచ్చేశారన్నారు. అధికారిగా మీరు వాళ్లను వెళ్లిపోమని చెప్పి ఉండవచ్చు కదా అని ప్రశ్నిస్తే.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇతరులు సర్వసభ్య సమావేశానికి ఇతరులు ఎలా వస్తారని నిలదేస్తే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

రోడ్డుప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు



రోడ్డుప్రమాదంలో గాయపడిన రవికుమార్

మదనపల్లె రూరల్ : రోడ్డుప్రమాదంలో టమాటా రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి గుర్రంకొండ మండలంలో జరిగింది. చెర్లోపల్లె పంచాయతీ ఎగువతొట్లివారిపల్లెకు చెందిన రైతు రవికుమార్ (47) టమాటాలను మదనపల్లె మార్కెట్‌కు తరలించి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.